ప్రజాశక్తి
సోమవారం 19 ఫిబ్రవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వీడని గందరగోళం



విశాఖకు చేరుకున్న పవన్‌తో ముచ్చటిస్తున్న నాయకులు

◆ కొన్ని సీట్లలో జనసేన, టిడిపి పట్టు
◆ అభిప్రాయ సేకరణలో జనసేన
◆ క్యాడర్‌ను కలిపే పనిలో లోకేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో తాము పోటీచేయబోయే సీట్లపై స్పష్టత కోసం పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకొనే పనిలో జనసేన నాయకులుండగా, యువగళం పాదయాత్రలో పెద్దగా కేంద్రీకరించని ప్రాంతాలపై శంఖారావం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఫోకస్ పెట్టారు. అనకాపల్లి జిల్లాలో కొద్ది రోజుల క్రితం పలువురి నాయకులు, క్యాడర్‌ను జనసేన నాయకులు నాగబాబు కలిశారు. తమకున్న రాజకీయ శక్తి, సామాజిక బలంపై వివరాలను ఆయన కేడర్‌ను అడిగితెలుసుకున్నట్లు తెలుస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం సాయంత్రం విశాఖ నగరానికి చేరుకున్నారు. నియోజకవర్గ నాయకులు, క్యాడర్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకోవడానికి సోమవారం ఓ సమావేశం ఏర్పాటుచేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని యలమంచిలి, పెందుర్తి నుంచి పోటీచేయాలని జనసేన నాయకులు సుందరపు విజయకమార్, పంచకర్ల రమేష్‌బాబు పట్టుబడుతున్నారు. నగర పరిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్, కోన తాతా రావు, బొలిశెట్టి సత్యనారాయణ, శివశంకర్, పసుపులేటి ఉషాకిరణ్ పోటీచేసే ఆలోచనలో వున్నారు. జనసేన, టిడిపి మధ్య సీట్ల కేటాయింపు తేలకపోవడంతో కొన్ని నియోజక వర్గాల్లో తాను పోటీ చేయనున్నానంటే, తాను పోటీచేయనున్నానంటూ టిడిపి, జనసేన నాయకులు ఎవరికి వారు ప్రచారం చేసుకోవడంతో కేడర్‌లో గందరగోళం ఏర్పడుతోంది.

ఎన్నికలు సమీపిస్తుండడంతో కేడర్‌కు ఓ స్పష్టత ఇవ్వడం కోసం పవన్ విశాఖ వచ్చినట్లు సమాచారం. పోటీ చేయడానికి ఉన్న అవకాశాలు, అవరోధాలు కూడా కేడర్‌కు వివరించి, ఆశావహులకు సీట్లు రాకపోయినా అసంతృప్తి చెందకుండా ఎన్నికల్లో పనిచేసేలా సూచనలు చేయనున్నట్లు మిగతా 2లో..



విన్యాసాలకు సిద్ధమైన నౌక

నేటి నుంచి మిలాన్ విన్యాసాలు

◆ 27 వరకూ రెండు ఫేజ్‌ల్లో విశాఖలో నిర్వహణ
◆ ప్రపంచ నలుమూలల నుంచి నౌకలు, ప్రతినిధులు రాక
◆ నగరంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిలాన్ - 2024 విన్యాసాలకు విశాఖ తీరం సిద్ధమైంది. ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగే ఈ 12వ ఎడిషన్ విన్యాసాలు సోమవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. 50 దేశాలకు చెందిన ప్రతినిధులు, నౌకలు పాల్గొనే అవకాశముంది. ఈ నెల 19 నుంచి 23 వరకు హార్బర్ ఫేజ్‌కు సంబంధించి విశాఖ నగరంలోనూ, 24 నుంచి 27 వరకూ సీ ఫేజ్ బంగాళాఖాతంలోనూ ఈ విన్యాసాలు జరుగనున్నాయి. ఇప్పటికే వియత్నాం, యుఎస్ నావికా దళాలకు చెందినా నౌకలు, ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. సోమవారం మిగిలిన దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు మిత్ర దేశాలకు చెందిన 15 నౌకలు విశాఖ చేరుకోనున్నాయి. రెండో రోజు మంగళవారం బీచ్ రోడ్డులో నావికా దళ విన్యాసాలతో పాటు మిలాన్ ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్ జరుగనున్నాయి. మూడో రోజు ఉదయం తూర్పు నావికాదళంలో సముద్రిక నావల్ ఆడిటోరియంలో ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నారు. నాలుగో రోజున బీచ్ రోడ్డులోని వైఎంసిఎ నుంచి ఆర్‌కె బీచ్ వరకూ ఇంటర్నేషనల్ సిటీ మిగతా 2లో..

గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు

▶ వార్త 2లో..

20న ఇగ్నో 37వ స్నాతకోత్సవం

▶ వార్త 2లో..

నేడు విశాఖ మ్యూజియం పున: ప్రారంభం

▶ వార్త 2లో..



బీచ్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేపడుతున్న న్యాయవాదులు

భూ యాజమాన్య హక్కుల చట్టంపై

న్యాయవాదుల నిరసన

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపాటు వార్త మెయిన్‌లో..

విశాఖకు ఇచ్చిన హామీల అమలేదీ ?

◆ రైల్వే జోన్, మెట్రో రైలు ఏమయ్యాయి..
◆ జగన్ సర్కారుపై శంఖారావం సభల్లో లోకేష్ విమర్శలు
◆ వైసిపిని బంగాళాఖాతంలో కలపాలని పిలుపు



విశాఖ తూర్పు నియోజకవర్గం నేతలతో కలిసి అభివాదం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్, గోపాలపట్నం విలేకరులు

'జగన్ నాడు విశాఖ పాదయాత్రలో జిల్లాకు 50 హామీలు ఇచ్చారు. విశాఖ రైల్వే జోన్ పూర్తిచేస్తామన్నారు. మెట్రోరైలు తెస్తామన్నారు. అవేవీ అమలుకాలేదు. ఉమ్మడి విశాఖలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని అన్నారు. 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని చెప్పారు. ఆ హామీలేవీ నేటికీ నెరవేరలేదు' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని విశాఖ వాసులు బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో ఆదివారం జరిగిన టిడిపి శంఖారావం సభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కును మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వీడని గందరగోళం

తెలిసింది. ఇటీవల జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లి ఎంపీగాగానీ, ఎమ్మెల్యేగాగానీ అవకాశమిస్తే పోటీచేయడానికి సానుకూలంగా వున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడ నుంచి ఎవరు పోటీచేస్తే మంచి ఫలితాలు సాధించగలమన్న అభిప్రాయాలను సేకరించి టిడిపితో సీట్ల కేటాయింపుపై చర్చించాలన్న యోచనలో పవన్ కళ్యాణ్ వున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇదే సమయంలో టిడిపి శంఖారావం పేరుతో లోకేష్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. విశాఖ నగరంలో తన పర్యటన సోమవారం మధ్యాహ్నానికి పూర్తిచేసుకొని, సాయంత్రానికి అనకాపల్లి నియోజకవర్గానికి ఆయన చేరుకోనున్నారు. అనకాపల్లి తరువాత చోడవరం నియోజకవర్గం శంఖారావం పూర్తిచేసుకొని, మంగళవారం మాడుగుల నియోజకవర్గంలో సభ నిర్వహించనున్నారు. లోకేష్ తన శంఖారావంలో టిడిపి, జనసేన నాయకత్వం కలిసి పనిచేసేలా సభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు.



తీరంలో ఆకట్టుకున్న నేవీ హెలికాప్టర్ల రిహార్సల్స్

నేటి నుంచి మిలాన్ విన్యాసాలు

పరేడ్ జరుగనుంది. చివరి రోజున పలు దేశాల నావికా దళాల మధ్య సమావేశాలు, సెమినార్లు ఉంటాయి. అనంతరం 24 నుంచి 27 వరకూ సీ ఫేజ్ విన్యాసాలు జరగనున్నాయి.

రెండో రోజూ కొనసాగిన రిహార్సల్స్

నావికాదళ సన్నాహక విన్యాసాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ విన్యాసాలలో మిగ్ 29కె, పి8ఐ, ఎంహెచ్ 60 ఆర్‌సి హాక్ హెలికాప్టర్లు, ప్యారాచూట్ విన్యాసాలు, మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేవీ బ్యాండ్ వినసొంపుగా సాగింది. నేవీ స్కూలు చిన్నారుల నృత్యాలు కనువిందు చేశాయి.

నగరమంతా భారీ భద్రతా ఏర్పాట్లు

మిలాన్ విన్యాసాల నేపథ్యంలో ఐదు వేల మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డితో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉందని నేవీ అధికారులు తెలిపారు. అతిథులు ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులపై ఇప్పటికే రూట్ మ్యాప్‌లు విడుదల చేసామని పోలీసు అధికారులు చెప్పారు. నగరమంతా ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

20న ఇగ్నో 37వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 37వ స్నాతకోత్సవం ఈ నెల 20న జరుగనుందని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కడ్ విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అధ్యక్షత వహించే ప్రాంతీయ స్నాతకోత్సవానికి విశిష్ట అతిథిగా దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య డి.సూర్యప్రకాశ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యార్థులకు డిగ్రీ, డిప్లొమాలను ప్రదానం చేయనున్నారు. విశాఖపట్నం ప్రాంతీయ స్నాతకోత్సవం స్థానిక పాత జైలు రోడ్డులోని విశాఖ మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాలలో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి జరగనుంది. మరిన్ని వివరాలకు విద్యార్థులు ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

దక్షిణ టిడిపి టికెట్ కోసం విల్లూరి దంపతుల దరఖాస్తు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి తిరుమల దేవి చక్రవర్తి శంఖారావం పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం టిడిపి టికెట్ కోసం దరఖాస్తులు సమర్పించారు. లోకేష్‌ను సత్కరించి విల్లూరి చిన్నతల్లి ట్రస్ట్ జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు.



లోకేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విల్లూరి దంపతులు

విశాఖకు ఇచ్చిన హామీల అమలేదీ ?



లోకేష్‌కు వల, చేపలు బహూకరిస్తున్న మత్స్యకారులు

(మొదటి పేజీ తరువాయి..)
ప్రైవేటీకరించాలని జగన్ చూస్తున్నారని తెలిపారు. అక్కడి భూములు కొట్టేయాలని చూస్తున్నారన్నారు. ఫలితంగా వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారన్నారు. టిడిపి - జనసేన ప్రభుత్వం వస్తే విశాఖ ఉక్కును కొనుగోలు చేసి ప్లాంట్‌ను కాపాడుతామని అన్నారు. జగన్ హయాంలో విశాఖపట్నం విషాదపట్నంగా మారిందన్నారు. గంజాయికి నగరం వేదికైందని తెలిపారు. నేరాలు పెరిగాయని అన్నారు. జగన్ జలగలాంటి వ్యక్తి అని విమర్శిస్తూ సైలెంట్‌గా గంగవరం పోర్ట్, కృష్ణపట్నం పోర్టులను కొట్టేశాడన్నారు. వాటిలో ఆయనకు వాటాలు పెట్టుకున్నాడని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా పోర్టులు మూసేస్తున్నాడని తెలిపారు. దీంతో కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న 10 వేల మంది కార్మికులు రోడ్డున పడనున్నారన్నారు. ఇదే పరిస్థితి గంగవరం పోర్టుకూ రాబోతోందన్నారు.

'వాసుపల్లికి టికెట్ ఇచ్చి తప్పు చేశాం.. క్షమించండి'

మతసామరస్యానికి మారుపేరుగా నిలిచిన విశాఖ దక్షిణ నియోజకవర్గం విషయంలో వాసుపల్లి గణేష్ కుమార్‌కు రెండుసార్లు తెలుగుదేశం పార్టీ టికెట్ ఇచ్చిందని, ఆయన వ్యక్తిగత స్వార్థంతో వైసిపిలోకి వెళ్లారని, అలాంటి వ్యక్తులకు టిడిపిలో నో ఎంట్రీ అని లోకేష్ అన్నారు. వాసుపల్లికి టికెట్ ఇచ్చి పొరపాటు చేశామని, తమను పెద్ద మనసుతో నియోజవర్గ ప్రజలు క్షమించాలని అన్నారు. దక్షిణ నియోజవర్గంలోని పేదలు ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. వారికోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకరిస్తామని తెలిపారు. వెంకటేశ్వర మెట్ట భూముల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరిగిన ఇందిరా మున్సిపల్ స్టేడియంను అభివృద్ధి చేసి పూర్వ వైభవం కల్పిస్తామన్నారు. 'కోడి గుడ్డు మంత్రి దెబ్బకు రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు వేరొకచోటుకు పారిపోయాయి' అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో టిడిపి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, ఎమ్మెల్సీ, జనసేన అర్బన్ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్, నాయకులు పి.శివప్రసాద్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపట్నం వద్ద సభకు హాజరైన టిడిపి కార్యకర్తలు

గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు

ఇప్పటికే ఐఎఫ్‌సి ప్రతినిధులతో చర్చలు
జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగరాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఎకో వైజాగ్ కోసం చేపట్టిన చర్యలను, నగరంలో ప్రగతిలో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రజాశక్తికి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఐఎఫ్‌సి ప్రతినిధులతో ఏం చర్చించారు ?

గత నెలలో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధి కెల్విన్‌తో కూడిన బృంద సభ్యులు జివిఎంసికి సంబంధించి పలు ప్రాంతాలను సందర్శించారు. ముందుగా నగర మేయర్‌తో సమావేశమయ్యారు. విశాఖ నగర పచ్చదనానికి సహకరిస్తూ 2024 ప్రపంచ పర్యావరణ దినోత్సవంలోగా ఒక మంచి ప్రణాళికా నివేదికను సమర్పించాలని మేయర్ ఐఎఫ్‌సి సభ్యులకు సూచించారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎకో-వైజాగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నేను సభ్యులకు తెలియజేశాను. జివిఎంసి పర్యావరణ పరిరక్షణ కోసం హార్టికల్చర్ విభాగం తలపెట్టిన అర్బన్ గ్రీన్ సోలార్, వేస్ట్ వాటర్ రీసైక్లింగ్ ప్రాజెక్టు, ఈ - వెహికిల్స్ గురించి ప్రతినిధులతో చర్చించాం. టెర్రస్ గార్డెన్ తీరును వివరించాం.

ఎకో వైజాగ్ గురించి తెలియజేస్తారా ?

మంచి పర్యావరణం, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రజలకు కల్పించడంలో జివిఎంసి నిత్యం కృషి చేస్తోంది. ఆ దృఢ సంకల్పంతోనే ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్ అనే ఐదు ముఖ్య అంశాలతో కూడిన 'ఎకో వైజాగ్' బృహత్తర కార్యక్రమాన్ని తీసుకున్నాం. విశాఖ నగరంలో



వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు, ఇంధనాన్ని పొదుపు చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రతి సోమవారం ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయాన్ని ఆచరిస్తూ నాతో పాటు నగర మేయరు, జివిఎంసి యంత్రాంగం అంతా కూడా ప్రజా రవాణానే ఉపయోగిస్తున్నాం.

నగరంలో జరుగుతున్న పనులు ఏంటి ?

ఇంజినీరింగ్ విభాగంలో నగర అభివృద్ధిలో భాగంగా 2023-24 సంవత్సరానికి



సంబంధించి 207 కోట్ల 79 లక్షల రూపాయల అంచనాలతో జివిఎంసి 989 పనులు చేపట్టగా 342 పనులను రూ.73 కోట్ల 41 లక్షల వ్యయంతో పూర్తి చేశాం. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. జివిఎంసి పరిధిలో మొదటి, రెండు దశలలో 25 ప్రధాన రోడ్లను విస్తరణ చేసి అందంగా తీర్చిదిద్దేందుకు 140 కోట్ల 15 లక్షల రూపాయలతో ప్రతిపాదించగా, ఒక పని పూర్తి కాగా, 15 పనులు పురోగతిలో ఉన్నాయి.

పార్కుల పరిస్థితి ఏంటి ?

జివిఎంసి పరిధిలో 8 ప్రధాన పార్కులు ఉండగా యోగా పార్క్, స్పోర్ట్స్ పార్క్, స్పీకర్స్ పార్క్, ఫామ్ గార్డెన్ పార్క్, తదితరాలను థీమ్ పార్కులుగా అభివృద్ధి పరుస్తున్నాం.

నేడు విశాఖ మ్యూజియం పున: ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకి చెందిన విశాఖ మ్యూజియాన్ని సోమవారం నుంచి పున: ప్రారంభించనున్నట్లు కమిషనర్ సిఎం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిలాన్ నేపథ్యంలో సుందరంగా తీర్చిదిద్దామన్నారు.

ప్రజాశక్తి 3
సోమవారం 19 ఫిబ్రవరి 2024

నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక శ్రీనూకాలమ్మ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఎన్నికలో కమిటీ అధ్యక్షులుగా గిడుతూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పి.రాజు, కోశాధికారిగా ఆర్.నరసింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగిరెడ్డి స్వామి, కో-ఆర్డినేటర్‌గా అప్పికొండ బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

'ముత్తంశెట్టిపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి -పద్మనాభం : శంఖారావం సభలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన విమర్శలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గిరిబాబు ఖండించారు. మూడేళ్లు మంత్రిగా ఉండి నియోజకవర్గానికి ముత్తంశెట్టి చేసిందేమీ లేదని లోకేష్ అనడాన్ని తప్పుపట్టారు. లోకేష్‌కు దమ్ముంటే 2024 ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి ముత్తంశెట్టిపై పోటీచేయాలని సవాల్ విసిరారు.

అనంతుని దేవస్థానంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి దేవస్థానం పరిధిలో రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు నిధుల నుంచి పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి దేవస్థానం అధికారులు ప్రతిపాదనలను రూపొందించారు. అనంతుని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు విశ్రాంతి భవనంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలను తయారు చేశారు. ఈ ప్రతిపాదనల కాపీని ఏపీ మెడికల్ విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ ద్వారా జివిఎల్‌కు అందించినట్లు ఆలయ ఇఒ నానాజీ బాబు తెలిపారు.

బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శిగా కదిరి రాము



ప్రజాశక్తి-లీగల్ : ఆంధ్రప్రదేశ్ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా విశాఖపట్నానికి చెందిన న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త కదిరి రాము నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి నియామక పత్రం జారీ చేశారని కదిరి రాము ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి రాము బిఎస్‌పి విశాఖపట్నం జిల్లా కన్వీనర్‌గా, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా సేవలందించారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా కదిరి రామును ఇటీవల అధిష్టానం ప్రకటించింది. బహుజన్ సమాజ్ పార్టీ బీసీలకు పెద్దపీట వేసిందని, 'మారు రావాలి-తీరు మారాలి' అని పేర్కొంటూ, 'సామాన్యుడే శాసన కర్త', అది ఒక్క బిఎస్‌పితోనే సాధ్యమని కదిరి రాము పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల నిర్వహణలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతికి, సహకరించిన సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎమ్.బాలన్న, రాష్ట్ర కో-ఆర్డినేటర్ లకే రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావుకు కదిరి రాము కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కదిరి రాముకు పలువురు అభినందనలు తెలిపారు.

జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు



గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లు

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం జల్లమ్మ కొండ వద్ద గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరందుకుంటున్నాయి. జల్లమ్మకొండను ఇప్పటికే ఇళ్ల స్థలాల పేరుతో చదును చేశారు. ఇది అదునుగా కొండ చుట్టూ గ్రావెల్ ను కొంతమంది తరలించుకు పోతున్నారు. ఆనందపురం 24 కాలనీ సమీపంలో కొంతమంది ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తుండగా ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. హౌసింగ్ పేరుతో తవ్వకాలు జరపడంతో స్థానిక ప్రజలు చూస్తూ ఉండిపోతున్నారు. పట్టించుకోవలసిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొండను నామరూపాలు లేకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలను అరికట్టి కొండను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

శిలా ఫలకాలు వేసి విస్మరించారు..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాడు వెంకటప్పడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : లెక్కకు మిక్కిలిగా శిలాఫలకాలు వేసి, వాటిని విస్మరించిన ఘనత టిడిపికే దక్కుతుందని వైసిపి నాయకులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మండల జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేష్ తన స్థాయిని తగ్గించుకునేలా ఆయన ప్రసంగం అవాస్తవాలతో ముగిసిందని విమర్శించారు. ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలు మెచ్చేలా స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పని చేస్తున్నారన్నారు. వైసిపి ఆనందపురం మండల నాయకులు బంక సత్యం మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో భీమిలి నుంచి వైసిపి ఘన విజయం తథ్యమని జోస్యం చెప్పారు. పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాముానాయుడు, పార్టీ నాయకులు జగుపిల్ల ప్రసాద్ మాట్లాడుతూ, ఎక్కువ కాలం అధికారంలో ఉన్న టిడిపి నాయకులు చిట్టివలస జ్యూట్ మిల్లును తిప్పలేక చతికిల పడ్డారని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, చిల్ల పేట, చిట్టివలస చెరువు సుందరీకరణ, రైతు బజారు ఏర్పాటుకు శిలాఫలకాలు వేసి, ఉత్సవ విగ్రహాలుగా మార్చిన ఘనత ఎవరిదని టిడిపి నాయకులను ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతు బజారు నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు.

సన్మానాలు బాధ్యతను పెంచుతాయి : అండిబోయిన



అప్పారావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : సన్మానాలు బాధ్యతను పెంచుతాయని ఎపి యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి అన్నారు. పవర్ లిఫ్టింగ్ 55 కిలోల జాతీయ స్థాయి పోటీలలో స్వర్ణ పతకం సాధించిన అండిబోయిన అప్పారావును నడుపూరు హైస్కూల్లో చదువుకున్న తోటి విద్యార్థులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ, అప్పారావు గడిచిన కొన్నేళ్లుగా అనేక పతకాలు సాధించారని తెలిపారు. హిందీ మాస్టారు రాజు మాట్లాడుతూ, తమ విద్యార్థి అండిబోయిన అప్పారావు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు గెలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల సూర్యనారాయణ, చీకటి శ్రీనివాస్, గొలుసు సత్యం, పూతి పోలారెడ్డి, ముత్యాలరావు, కాకినాడ సత్యనారాయణ, బిఎస్‌ఆర్.మూర్తి, కిలాని రమణ, బొడ్డు నూకరాజు, నామాల వరహాలరావు, వి.కనకారెడ్డి పాల్గొన్నారు.

బిఎస్‌సి ఆప్టోమెట్రీ విద్యార్థులకు ఉద్యోగ కల్పన



నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కాలేజీలో మూడేళ్ల బిఎస్‌సి (ఆప్టోమెట్రీ) కోర్సు పూర్తిచేసిన విద్యార్థులను శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో పర్మినెంట్ ఉద్యోగాల్లో నియమించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అడ్మిన్ అండ్ ఆపరేషన్స్ జిఎం కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, విద్యార్థులు సొంతంగా నిలబడేలా జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. స్కూల్ ఆఫ్ ఆప్టోమెట్రీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, పాఠశాలలో అందిస్తున్న ఆప్టోమెట్రీలో డిగ్రీ/ డిప్లమా కోర్సులను వివరించారు. డిజిఎం వి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ, బిఎస్‌సి ఆప్టోమెట్రీ పూర్తిచేసిన ఏడుగురు బాలికలు, ఒక అబ్బాయికి ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ ఎం.శివప్రసాద్, కె.వినోద్‌కుమార్, అలేఖ్య, మౌనిక, కె.బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ములగాడ : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మల్కాపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మల్కాపురం జాలారివీధి ప్రాంతానికి చెందిన మెదు నవీన్ (23) విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. నవీన్ కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మానసికస్థితి బాగాలేని కారణంగానే స్తంభం ఎక్కినట్లు తెలుస్తోంది. ఈ కేసును మల్కాపురం సిఐ సన్యాసిరావు ఆధ్వర్యాన ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

చెట్టును ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని రామచంద్ర పాలెం వద్ద బక్ అదుపుతప్పి చెట్టు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం నీలిగుంట గ్రామానికి చెందిన కె.లోవ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉండగా అదుపుతప్పి చెట్టు ఢీకొనడంతో ప్రమాద సంఘటన స్థానంలోనే మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు . స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్

ప్రజాశక్తి -గాజువాక : చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యానికేతన్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు పొందాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 580 మార్కులు పైబడి తెచ్చుకున్న విద్యార్థులకు నగదు బహుమతులను డిఇఒ ద్వారా అందజేస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి, ఉపాధ్యాయులు శ్వేత, సరోజిని, పద్మ, మౌళి, శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న ఉరుకూటి చందు

76వ వార్డులో ఉరుకూటి పాదయాత్ర

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి నడుపూరులో వైసిపి గాజువాక నియోజవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు ఆదివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగన్మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి సుపరిపాలన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంత్రి రాజశేఖర్, ఉరుకూటి అప్పారావు, తాటికొండ అచ్యుత్ పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విగ్ద శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. సుమారు వంద మందికి హోమియో వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.పద్మజ తదితరులు పాల్గొన్నారు

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన మధురవాడ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు కొంతమంది వైద్యులు ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. నిత్యావసర సరుకులు బియ్యం, పప్పు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వై.శ్రీనివాసరావు, తెడ్డు జగదీష్ చంద్రప్రసాద్, ప్రత్యూష, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ ప్రసాద్, షారుక్ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి కోసం అమర్‌నాథ్‌ ఇల్లు ముట్టడి

ప్రజాశక్తి -గాజువాక : మెగా డిఎస్‌సి విడుదల చేయాలని కోరుతూ యూత్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యాన మిందిలోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ ఇంటిని ఆదివారం ముట్టడించారు. తక్షణమే మెగా డిఎస్‌సి విడుదల చేయాలని నినదించారు. నిరుద్యోగులను దగా చేశారని నినాదాలు చేశారు. పోలీసులు భారీ ఎత్తున చేరుకొని కాంగ్రెస్‌ నాయకులను అరెస్టు చేసి గాజువాక పోలీస్‌ స్టేషన్‌ తరలించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా స్టార్‌డం ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 85వ వార్డు పరిధి అగనంపూడి దిబ్బపాలెంలో స్టార్‌డం స్కూల్‌ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇనిస్టిట్యూషనల్‌ ఎడ్యుకేషన్‌, ట్రైనింగ్‌ వైస్‌ ప్రిన్సిపల్‌ బొడ్డు రవి, విశాఖ జిల్లా డిప్యూటీ డిఇఒ ఎ.గౌరీశంకర్‌ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను నేర్పాలని, క్రమశిక్షణ అంకితభావం ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరామయ్య, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలో వివిధ ప్రాంతాల్లో కరస్పాండెంట్‌ ఎస్‌.రంగారావు ఏడు శాఖలు ప్రారంభించి, విద్యార్థులను ఉత్తమంగా తయారుచేస్తున్నారని కొనియాడారు. ప్రిన్సిపల్‌ శంబంగి నాగభూషణ్‌ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో గాజువాక నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు, 79వ వార్డు కార్పొరేటర్‌ రౌతు శ్రీనివాసరావు, బ్రాహ్మణ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ జి.పూర్ణానందశర్మ, 85వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఇల్లపు ప్రసాదు, ఎడిసి ఛైర్మన్‌ బలిరెడ్డి సత్యనారాయణ, జనసేన నాయకులు గవర సోమశేఖర్‌, మేడిశెట్టి విజయ్‌, టిడిపి నాయకులు నెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. పాఠశాల కరస్పాండెంట్‌ ఎస్‌.రంగారావును అతిథులు సన్మానించారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి కిశోర్‌కుమార్‌

అనకాపల్లిని అభివృద్ధి చేస్తా : ఆడారి

ప్రజాశక్తి-సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ టికెట్‌ టిడిపి తరుపున తనకు కేటాయిస్తే అద్భుతమైన అభివృద్ధి చేస్తానని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఆడారి కిశోర్‌ కుమార్‌ చెప్పారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి పట్టణంలోనే తాను పుట్టి, ప్రాథమిక విద్య నుంచి కళాశాల వరకూ చదువుకున్నట్లు తెలిపారు. ప్రజా స్వామ్య రక్షణ కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఉద్యమాలు చేశానని చెప్పారు. యువతకోసం పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో శిక్షణ, మెగా జాబ్‌ మేళా నిర్వహించి సుమారు 10 వేల మందికి ఉపాధి కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యపరంగా ఎవరికైనా ఇబ్బందులున్న సందర్భాల్లో తగు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఇంటికో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం ఆర్థికంగా మెరుగు పడుతుందని తెలిపారు.

అనకాపల్లి లోక్‌సభ ప్రాంతం అభివృద్ధి కోసం ప్రత్యేక బ్లూప్రింట్‌ ఉందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పూర్తి అవగాహన, ప్రజా బలం, సామాజిక వర్గ మద్దతు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోసం అన్ని వేళలా నిబద్ధతతో పనిచేశానని చెప్పారు.

అక్రమ నిర్మాణాల జోరు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్‌ -3 పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టౌన్‌ ప్లానింగ్‌ నిబంధనలు తుంగలో తొక్కి సంబంధిత బిల్డర్‌ ఇష్టారాజ్యంగా భారీగా స్థాయిలో భవనం నిర్మిస్తున్నా టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జివిఎంసి 23వ వార్డులో రోడ్డు, సెట్‌బ్యాక్‌ లేకుండా నిర్మిస్తున్నట్లు గత ఏడాది ఆగస్టులో వచ్చిన ఫిర్యాదులతో రెండు ఫ్లోర్లు నిర్మించాక టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు స్పందించి వాటిని గ్యాస్‌ కటింగ్‌ చేసి



అక్రమం అంటూ గతంలో పిల్లర్లను తొలగించిన దృశ్యం (ఫైల్‌)



చెన్నూరు మసీదు వద్ద రెసిడెన్సీ అనుమతి తీసుకొని కమర్షియల్‌గా చేపట్టిన నిర్మాణం

తొలగించారు. 23వ వార్డు చైతన్యనగర్‌లో 1086/1309/బి/Z3/CAR/2022 బిఎ నెంబర్‌తో నాలుగు ఫ్లోర్లు నిర్మించారు. 1086/1319/బి/Z3/CAR /2022 వాటికి అసలు ప్లాను షార్ట్‌ ఫాల్లో ఉండగా, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పడంతో గుట్టుచప్పుడు కాకుండా గత ఆగస్టులో తొలగించిన రెండు ఫ్లోర్లు పైన మరో రెండు ఫ్లోర్లు మొత్తం 4 ఫ్లోర్లు చకచకా నిర్మించేశారు. అక్కడ ప్లానులో మరో మతలబు ఏంటంటే 313, 314 చదరపు గజాల స్థలంలో ప్లానలకు కేవలం 125, 128 గజాలకు మాత్రమే జివిఎంసికి ఫీజులు చెల్లించారు. దీంతో జివిఎంసి టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు ఒక ఫ్లోర్‌కు ఒక ఫ్లాట్‌ మాత్రమే నిర్మించాలని అనుమతులు ఇచ్చారు. కానీ అక్కడ ఒక ఫ్లోర్‌కు రెండు (ఫ్లాట్లు) యూనిట్లు నిర్మించారు. అంటే రెండు అప్లికేషన్లకు రెండు చొప్పున ఒక ఫ్లోర్‌కు రెండు ఫ్లాట్లునిర్మించాల్సి ఉంది, కాని ఒక్కొక్క ఫ్లోర్లో నాలుగు ఫ్లాట్లు చొప్పున మొత్తం 16 ఫ్లాట్లు నిర్మించి జివిఎంసి ఆదాయానికి భారీగా గండి కొట్టారు.

జివిఎంసి 26వ వార్డు పరిధి చిన్నూర్‌ మసీదు వద్ద రెసిడెన్సి ప్లాన్‌ తీసుకున్న నిర్మాణదారుడు కమర్షియల్‌గా షాపులు కట్టాడు. అనధికారికంగా మరొక ఫ్లోర్‌ నిర్మించారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా కనీసం జివిఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు. జోన్‌-3లో అనధికారికంగా నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దీనిపై టిపిఒ ప్రమీలను వివరణ కోరగా పై రెండు నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.



ప్రస్తుతం నాలుగు ఫోర్లతో నిర్మాణం పూర్తిచేసుకుంటున్న భవనం

ఐద్వా జాతీయ సమావేశాల పోస్టర్‌ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్‌ : ఈ నెల 22 నుంచి 25 వరకు విశాఖపట్నంలో జరగనున్న ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను పందిమెట్ట జంక్షన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జగదాంబ జోన్‌ నాయకురాలు కె.మణి మాట్లాడుతూ సమావేశాల ప్రారంభం రోజున మధ్యాహ్నం 2 గంటలకు సరస్వతీ పార్కు నుంచి వైఎస్‌ఆర్‌ సెంట్రల్‌ పార్కు వరకూ భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటాయన్నారు. కార్యక్రమంలో సరస్వతి, ఏరియా చిన్నారులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

సీతమ్మధార : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22 నుంచి జరిగే ఐద్వా జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎఎస్‌ఆర్‌.నగర్‌ కాలనీలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ప్రియాంక మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులపై సమావేశాల్లో చర్చించి తగు నిర్ణయాలు చేస్తారని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్లు, చట్టాలు నోటిమాటకే పరిమితమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్‌ నాయకులు లీల, శ్యామల, ఆది, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఎఎస్‌ఆర్‌ నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

ప్రపంచ శాంతికి కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ శాంతికి ఇంటర్నేషనల్‌ అసోసియేషన్‌ ఫర్‌ రిలీజియస్‌ ఫ్రీడమ్‌ సంస్థ పనిచేస్తోందని బివి.ఫౌండేషన్‌ ఫర్‌ పీస్‌ అండ్‌ హార్మోనీ ఛైర్మన్‌ నరవ ప్రకాశరావు చెప్పారు. ప్రపంచ మతసామరస్య వారోత్సవాల్లో భాగంగా బివి ఫౌండేషన్‌ ఫర్‌ పీస్‌ అండ్‌ హార్మోనీ, ఇంటర్నేషనల్‌ అసోసియేషన్‌ ఫర్‌ రిలీజియస్‌ ఫ్రీడమ్‌ సంస్థ సంయుక్తంగా ఆదివారం డాక్టర్‌ ఎల్‌బి.కాలేజీ ప్రాంగణంలో 'ప్రపంచ శాంతికి కళలు, సంస్కృతి పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. తొలుత గాంధీ చిత్ర పటానికి నరవ ప్రకాశరావు, ఆచార్య జార్జి విక్టర్‌ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు ఏటా ఫిబ్రవరిలో మతసామరస్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ విశ్రాంత వైస్‌ చాన్సలర్‌ ఆచార్య జార్జ్‌ విక్టర్‌ మాట్లాడుతూ, మత సామరస్యం శాంతికి పునాది అని, బాల్య దశలోనే విద్యార్థుల్లో శాంతి సామరస్యం ఆవశ్యకత గురించి అవగాహన కల్పిస్తే తద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోగలమని చెప్పారు. మతాలు మానవుని సృష్టి అని, వాస్తవాలు తెలియక పోవడం వల్ల శాంతికి భంగం కలుగుతుందని పేర్కొన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే విస్తృతమైన అవగాహన కలుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో హరగోపాలరావు, హుస్సేన్‌, ఛాట్ల బాబూరావురెడ్డి, బి.వెంకటేశ్వర్లు, బిఎస్‌వి.రెడ్డి, అబ్దుల్‌ మునీర్‌, డాక్టర్‌ గ్యానేశ్వర బాబ్జీ, రఘు కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

శంఖారావం సభకు స్పందన కరువు : ముత్తంశెట్టి

ప్రజాశక్తి- సీతమ్మధార: శంఖారావం సభ అట్టర్‌ ఫ్లాప్‌ అని, లోకేష్‌ సభకు స్పందన లేదని, ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఆయన చదువుతున్నాడని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. సీతమ్మధారలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ముత్తంశెట్టి మాట్లాడుతూ, లోకేష్‌ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడన్నారు. భీమిలిలో రెండు వేల ఎకరాలు కబ్జా చేశానని అంటున్న లోకేష్‌ నిరూపిస్తే ఆ భూమిని ఆయనకే రాసిస్తానన్నారు. లోకేష్‌కు ధైర్యం ఉంటే భీమిలిలో పోటీ చేయాలని సవాల్‌ విసిరారు. విశాఖ నగరంలో భూ కబ్జాలకు పాల్పడింది టిడిపి నేతలేనని ఆరోపించారు. పవన్‌ కల్యాణ్‌ ఆత్మాభిమానం లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి ఇవ్వబోమన్నా, ఛీ పొమ్మన్నా పవన్‌ టిడిపి వెంట పడుతున్నారని తెలిపారు. రాజ్యసభ సీట్లతో చంద్రబాబు, లోకేష్‌ వ్యాపారం చేశారని ఆరోపించారు. దళితునికి రాజ్యసభ సీటు ఇచ్చిన చరిత్ర జగన్మోహన్‌రెడ్డిదన్నారు.

20న జెఏసి ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉన్న రూ.20 వేల కోట్లను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఒపిఎస్ అమలు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎపి జెఏసి పిలుపులో భాగంగా విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నాలో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వం కంటితుడుపు చర్యగా నియమించిన పిఆర్‌సి కమిటీ ఇంకా తన పనులు మొదలు పెట్టలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మిగిలిన పిఆర్‌సి, డిఎ, పిఎఫ్, ఎపి జిఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 28న చలో విజయవాడ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ నాయకులు లక్ష్మీనారాయణ, నాగభూషణం, మహేష్, సురేష్, ఫణిభూషణం, జగదీష్, ఉమామహేశ్వరరావు, శాంబశివ, రవి, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

డ్వాక్రా సమన్వయ సదస్సును విజయవంతం చేయాలి : ఐద్వా



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నాయకురాలు వరలక్ష్మి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనం, సిఐటియు కార్యాలయంలో ఈనెల 20న జరుగు డ్వాక్రా సమన్వయ సదస్సును విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మూలపేట గ్రామంలో ఐద్వా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ 20న మంగళవారం "స్వయం సహాయ సంఘాలు - మహిళా సాధికారత' అనే అంశంపై జరుగు సదస్సుకు మహిళలందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా ప్రతినిధివర్గం అందరూ హాజరవుతారని, అనేక అంశాలపై చర్చిస్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు సదస్సుకు హాజరుకావాలని కోరారు.

నూకాంబికను దర్శించుకున్న నాగబాబు



నాగబాబును సత్కరిస్తున్న జనసేన, టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని నూకాంబిక అమ్మవారిని జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం నాగబాబుకు అమ్మవారి చిత్రపటాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బహుకరించారు. అనంతరం వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుందరపు విజయ్‌కుమార్, మళ్ల శ్రీను, టిడిపి నాయకులు దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, దాడి జయవీర్, కర్రి బాబి, పోలవరపు త్రినాథ్, ఆలయ ఇఒ బండారు ప్రసాద్, అధికసంఖ్యలో టిడిపి, జనసేన నేతలు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

జోరుగా భరత్ పరిచయ కార్యక్రమం



కార్పొరేటర్ లక్ష్మిసౌజన్యకు బర్త్‌డే కేకు తినిపిస్తున్న భరత్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరిచయ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఆదివారం 81వ వార్డు కార్పొరేటర్ పీలా సౌజన్య పుట్టినరోజు వేడుకలో పాల్గొని, కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ ఆధ్వర్యంలో శారదనగర్, భవానీనగర్‌లో వివిధ సంఘాల నాయకులను కలిశారు.

గవరపాలెంలో పెంటకోటవారి, గాంధీనగర్‌లో పీలా వారి, అలాగే కుంచంగిలో పడటాల వారి వివాహ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులు శేషు భవాని ప్రసాద్ రేవతి లక్ష్మి, అలాగే మహోదయ్, శ్రీహరి, సత్తిబాబు, అశ్వినిలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, ఆళ్ల నాగేశ్వరరావు, బొడ్డేడ శివ, కెఎం నాయుడు, గంగుపాము నాగేశ్వరరావు, కుమార్ రాజా పాల్గొన్నారు.

త్వరలో అనకాపల్లి పేరుతో సినిమా

సినీ దర్శకులు నక్కిన త్రినాధరావు వెల్లడి



మాట్లాడుతున్న సినీ దర్శకులు నక్కిన త్రినాధరావు

ప్రజాశక్తి- అనకాపల్లి: తన సొంత నిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్ బ్యానర్‌పై 'అనకాపల్లి' పేరుతో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు సినీ దర్శకులు నక్కిన త్రినాధరావు ప్రకటించారు. ఆదివారం గౌరీ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లిలోనే నటీనటులు ఎంపిక (ఆడిషన్స్), చిత్రీకరణ జరుగుతుందన్నారు .తన సినీ జీవిత ప్రస్థానానికి బీజం వేసింది శ్రీగౌరీ గ్రంథాలయంలోనేనని, సినిమాలకు సంబంధించిన పుస్తకాలను ఇదే గ్రంథాలయంలోనే చదువుకున్నా నన్నారు. సినీ పరిశ్రమలో ఎంతటివారికైనా గ్యారెంటీ సున్నాయేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, వృత్తినైపుణ్య శిక్షణ కార్యక్రమాలు గ్రంథాలయంలో నిర్వహించడం ద్వారా ఎందరికో ఉద్యోగ, ఉపాధికి దోహదపడడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఆలోచనలు, పాఠకుల మనోగతానికి అనుగుణంగా ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గౌరీ గ్రంథాలయాన్ని అప్‌టూ డేట్ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, జగన్నాథస్వామి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, సినీ నటుడు బాలాజీ బద్రీనాథ్, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల సురేష్, శీలా జగన్నాధరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్కిన త్రినాధరావును గ్రంథాలయ కమిటీ ఘనంగా సత్కరించింది.

భూయాజమాన్య హక్కుల చట్టంతో నష్టం

మాజీ ఎమ్మెల్యే కోడుగంటి వర్ధంతి సందర్భంగా జిల్లా సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి-అనకాపల్లి : భూయాజమాన్య హక్కుల చట్టంతో సొంత భూమి కలిగిన భూస్వల యజమానులు, రైతులందరూ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణ మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సిపిఐ మాజీ ఎమ్మెల్యే కోడుగంటి గోవిందరావు పదవ వర్ధంతి సందర్భంగా 'భూ యాజమాన్య హక్కుల చట్టం- పూర్వాపరాలు- పరిణామాలు' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు

ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే ఈ చట్టాన్ని అమలు చేయడం లేదని, అలాంటిది మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన కేసులకు భయపడి ఈ చట్టం అమలుకు ఉత్సాహం చూపడందుర్మార్గమన్నారు. కేంద్రం వద్ద రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టే విధానాలను వీడాలని హెచ్చరించారు.

కొడుగంటికి ఘననివాళి

అంతకుముందు కమ్యూనిస్టు నేత, మాజీ ఎమ్మెల్యే కొడుగంటి గోవిందరావు వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘననివాళులర్పించారు. స్థానిక సిపిఐ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్‌లోకి కొడుగంటి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, బాలేపల్లి వెంకటరమణ, చెరుకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, సీనియర్ నాయకులు రావు జగ్గారావు, మేక సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీలో రైతు సంఘం నాయకులు కోరుబిల్లి శంకరరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, వెలుగుల అర్జునరావు వియ్యపు రాజు, వేముల కన్నబాబు కోరిబిల్లి శంకర్రావు గొర్లె దేముడు బాబు, నరాల శెట్టి సత్యనారాయణ, విత్తనాల పోతురాజు,గోవిందరావు అభిమానులు పాల్గొన్నారు.

వైసిపికి 'గొలగాని' రాజీనామా

- నేడు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిక



గొలగాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : యాదవ యువజన సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, మల్లాం మాజీ సర్పంచ్ గొలగాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం వైసిపికి రాజీనామా చేసారు. సోమవారం మండలంలోని వడ్డాదిలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం బహిరంగ సభలో టిడిపిలో అధిక సంఖ్యలో కార్యకర్తలతో చేరుతున్నట్లు తెలిపారు.

జనసేన ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న నవీన్

ప్రజాశక్తి- వడ్డాది : టిడిపి, జనసేన పొత్తుతో గ్రామస్థాయిలో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని జనసేన నాయకుడు సయ్యపురెడ్డి నవీన్ అన్నారు. ఆదివారం వడ్డాది జంక్షన్‌లో జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీఎం కావాలన్నదే అందరి లక్ష్యమన్నారు. పొత్తులో భాగంగా పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తే వారిని గెలిపించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో అఖండ విజయంతో టిడిపి జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. వచ్చే ప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామ్యం అవుతుందన్నారు. ఎన్నికలకు మరో రెండునెలలైనా సమయం లేనందున ఇప్పటినుంచే శక్తివంచన లేకుండా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నేతలు సయ్యపురెడ్డి జనార్ధన, బొబ్బాది మాణిబు, గుండు గణేష్, నాలం వరహాలు పాల్గొన్నారు.

'పది' పరీక్షల సన్నద్ధతలో నిర్లక్ష్యం తగదు

డిఇఒ వెంకటలక్ష్మమ్మ : పలు పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- కశింకోట : పదవ తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధత చేసే విషయంలో నిర్లక్ష్యం, ఉదాసీనత ఎంతమాత్రం సరికాదని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ సూచించారు. ఆదివారం కశింకోట బాలుర, బాలికల హైస్కూల్స్, కొత్తపల్లి ఉన్నతపాఠశాల, తేగాడ కస్తూర్బా విద్యాలయను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంఆ కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించకపోవడంపై పాఠశాల హెచ్ఎంతోపాటు ఇద్దరు ఎంఇఒలను ప్రశ్నించారు. వివరణ కోరారు. టెన్త్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉత్తమ ఫలితాల సాధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఫలితాలపై దీని ప్రభావం ఉంటే సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటినుంచైనా విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

విపత్తుల నుంచి రక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సురేష్

ప్రజాశక్తి- కె.కోటపాడు: ప్రకృతి విపత్తుల నుండి మనల్ని మనం కాపాడుకోవడంతోపాటు తోటి వారిని రక్షించడంపై సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆదివారం మండల కేంద్రంలోని రామాలయంలో సత్యసాయి సంస్థల రాష్ట్ర ప్రకృతి విపత్తుల కోఆర్డినేటర్ బండి సురేష్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎత్తైన భవనాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి.జాగ్రత్తలు, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడంపై వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, మూడవ జోన్ కన్వీనర్ కసిరెడ్డి అప్పలనాయుడు, దార్ల శివ గురన్నాచారి, మణికంఠ, రమేష్, మనోజ్, శివ, చిరంజీవి, శ్రవణ్, ఆనంద్, మహేశ్వరి, శివారెడ్డి, పైలా గోపి పాల్గొన్నారు

గాయపడిన టిడిపి నేతకు పరామర్శ


రాజును పరామర్శిస్తున్న శ్రీనివాసరావు, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి- కశింకోట : కాలుకు తగిలిన దెబ్బతో చికిత్స పొంది విశ్రాంతి పొందుతున్న మండలంలోనిజమదుల పాలెం మాజీ ఎంపిటిసి, తెలుగుదేశం పార్టీ నాయకులు కరకరాజును తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, సోమవారం మాజీ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. రాజు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెర్రిపోతుల నూకునాయుడు, కరక బాబూరావు, నారిపల్లి ప్రసాద్, తాడేలు సూరిబాబు పాల్గొన్నారు

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


రోగులకు కంటిపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలో షిరిడిసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటివైద్య శిబిరంలో 90 మంది రోగులు పాల్గొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 21 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ప్రత్యేక వాహనంలో శస్త్రచికిత్సకు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో షిరిడి సాయి సేవా సమితి సభ్యులు ప్రకాష్, నాని, బర్ల రమణ, వైకుంఠరావు పట్నాయక్, సత్యం నాయుడు, కృష్ణవేణి, సీతారత్నం, సీతాలక్ష్మి, ఆనంద్, భాస్కర్, అర్జున్, సత్యవతి పాల్గొన్నారు.

21 నుంచి బిజెపి ప్రజా పోరుయాత్ర

ప్రజాశక్తి - చోడవరం : ఈ నెల 21 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి ప్రజాపోరుయాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కందర్ప రమణమూర్తి, శ్రీనివాసరావు, అప్పలకొండ, కుమార్, మురళి పాల్గొన్నారు.

20 నుంచి కన్యకా పరమేశ్వరి శత ప్రతిష్ట ఉత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని ప్రతిష్ఠించి వందేళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఆదివారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పట్టణంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రతిష్ఠించి ఈనెల 20న భీష్మ ఏకాదశి రోజుతో వందేళ్లు పూర్తవుతుందన్నారు. వందకిలోల వెండితో తయారుచేసిన రథాన్ని ఆ రోజున వినియోగంలోకి తెస్తామన్నారు. 108 కలశాలతో మహిళలతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో 21 నుంచి 23వ వరకు ప్రత్యేక పూజలు, ఏడాదిపాటు ప్రతి ఆదివారం సూర్య నమస్కారాలు నిర్వహిస్తామని ప్రతిష్ఠా శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. చిన్న వీధిలోని దేవస్థానానికి చెందిన నుదురుపాటి వరహాలు కల్యాణ మండపం పునర్నిర్మిస్తామన్నారు. ఏటా విద్యార్థులకు రూ.రెండు లక్షలతో స్కాలర్‌షిప్‌లు, ప్రతిశుక్రవారం అన్నసమారాధన, ఉచిత వైద్యశిబిరాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, ప్రతిష్ఠా జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, నుదురుపాటి తాతాజీ, గ్రంధి మాణిక్యం పాల్గొన్నారు.

20 నుంచి ఉమామహేశ్వరి దేవి కల్యాణం


ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి :మండలకేంద్రంలోని ఈనెల 20నుంచి 25వరకు నిర్వహించనున్న ఉమామహేశ్వరి దేవి తీర్థం, కల్యాణోత్సవాల వాల్‌పోస్టర్లను ఆదివారం తారువలోని క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠచర్యలు చేపట్టాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, మండల అధ్యక్షులు బూరె బాబూరావు, వర్ధపరెడ్డి సింహాచలంనాయుడు, గండి పడాల అప్పలరాజు, గుండు రాంబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకునిగా రాహుల్

ప్రజాశక్తి- అచ్యుతాపురం : పాయకరావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా అచ్యుతాపురం మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎన్‌వి‌ఆర్ రాహుల్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో అంకితభావంగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన రాహుల్‌ను ఈ పదవిలో నియమించిన ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాహుల్ నియామకం పట్ల కాంగ్రెస్ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు తనకాల అనంతరావు హర్షం తెలిపారు.

ప్రశాంతి కళాశాలలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఫ్యాషన్ అండ్ గార్మెంట్స్ మేకింగ్ కోర్సులో ప్రవేశానికి ఆదివారం స్థానిక ప్రశాంతి జూనియర్ కళాశాలలో బ్రాండిక్స్ సహకారంతో ప్రవేశ పరీక్షను నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రెండేళ్ల కాలవ్యవధితో కూడిన ఉచిత శిక్షణను బ్రాండిక్స్‌లో ఇస్తారనికళాశాల ప్రిన్సిపల్ లాలం అప్పలనాయుడు తెలిపారు.శిక్షణ సమయంలోఉపకార వేతనం అందజేస్తారన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత అప్పారావు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయతీ శివారు ఎర్రవానిపాలెం గ్రామంలో శ్రీకృష్ణుడు గుడి నిర్మాణానికి జనసేన జిల్లా నాయకులు బలిరెడ్డి అప్పారావు రూ.55,558 నగదును ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్రవాని పాలెంలో ఆలయ నిర్మాణానికి తనవంతుగా ఈ ఆర్థికసాయం చేశానని, భక్తులందరూ తలోచేయి వేస్తే ఆలయ నిర్మాణం మరింత సుందరంగా పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా అప్పారావుకు ఆలయ కమిటీ, ఎర్రవానిపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోన కృష్ణ, రోమాల అప్పారావు, పంచదార్ల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సత్యవమ్మ పేరంటాలు తీర్థం

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని మేజర్ పంచాయతీ సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో గొర్లి కుటుంబీకులు కొటాన రాంబాబు, దేవి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం సత్యవమ్మ పేరంటాలు తీర్థం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం-2 ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గొంప దేముడు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థంలో భాగంగా సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నేతలు బైలపూడి సత్యం, మద్దు సూర్యనారాయణ, గొర్లి కనకం, కొటాన మణి, గుల్లేపల్లి ముత్యాలనాయుడు, కామిరెడ్డి అచ్యుతరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీతారాముల పుష్పయాగం

ప్రజాశక్తి- కె కోటపాడు : మండలంలోని రామయోగి అగ్రహారం గ్రామంలో మండవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ లక్ష్మణ సమేత సీతారామ స్వామికి 1500కిలోలపువ్వులతో పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. పరిసరగ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మండవారి కుటుంబ సభ్యులతోపాటు, గ్రామ ప్రజలు ,మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఆలయ ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం గ్రామంలో హరిగిరి కొండపై నూతనముగా నిర్మించిన ఆలయాన్ని సోమవారం ప్రారంభిస్తామని గ్రామ సర్పంచ్ ఎం లక్ష్మీకాంతం సూర్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి, ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, టిడిపి, జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయ్‌కుమార్ ఇతర ముఖ్యనేతలు హాజరవుతారని తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.


సొంతింటి కల సాకారమయ్యేనా

- జగనన్న కాలనీల్లో వసతులు కరవు
- ముందుకు సాగని పనులు
- ఆవేదనలో లబ్ధిదారులు



అన్నవరంలో నిరుపయోగంగా ఉన్న బోరు

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు, శాశ్వత గృహాలు అంటూ ఉదరగొడుతున్నా కింది స్థాయిలో వాస్తవ రూపం దార్చలేదు. జగనన్న కాలనీ గృహాల నిర్మాణంలోనే కాదు నిర్వహణలో కూడా అటు ప్రభుత్వం పట్టించుకోలేదు. మండల వ్యాప్తంగా 19 సచివాలయాల పరిధిలో 32 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని ప్రాంతాల్లో స్థలాన్ని కొనుగోలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. 32 లేఔట్లకు గాను 940 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా కేవలం 512 మంది మాత్రమే గృహాలు నిర్మించుకుంటూ వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. 32 లేఔట్లకు గాను అన్నవరం, జల్లూరు, గొట్టువాడ, కోటవురట్ల, పాములవాక గ్రామాలలో ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసింది. కొనుగోలు చేసిన స్థలాల్లో అన్నవరం, జల్లూరు లేఔట్లను లబ్ధిదారులు తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. కాగా నేటికీ మొదలు పెట్టని లేఔట్‌లు విషయానికి వస్తే ఆత్సాహెబ్‌పేట, పందూరు, నీలిగుంట, లింగాపురం, తంగేడు గ్రామాలలో ఉప్పాయి. ఎంపిక చేసిన లేఅవుట్లలో నేటికీ నిర్మాణాలు చేపట్టక పోవడం విశేషం. ఈ లేఔట్ల లెవెలింగ్ నిమిత్తం



నిలిచిన ఇంటి నిర్మాణాలు

ఉపాధి హామీ విధుల నుంచి లక్షల రూపాయలు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. నివాసయోగ్యం కానీ స్థలాలు ఎంపిక చేశారంటూ లబ్ధిదారులు తిరస్కరించారు. కాగా ఎంపిక చేసిన 32 లేఔట్లలో 940 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా కేవలం 540 మంది మాత్రమే నిర్మాణం చేపడు తున్నట్లు అధికారిక గణాంకాలు. వీటిలో నిర్మాణాలు పూర్తయినవి 229 మాత్రమే కావడం విశేషం.

ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా లేఔట్లు సహా సొంత స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్న వారు మొత్తం 1815 మంది ఉండగా కేవలం 1086 మంది నిర్మాణాలు చేపట్టుకుంటూ వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో పూర్తయింది కేవలం 526 మాత్రమే ఉండడం విశేషం. ప్రభుత్వం ఇటీవల శాశ్వత గృహ హక్కు అంటూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతూ ఉండగా 824 మందికి రిజిస్ట్రేషన్లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కేవలం 642 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిపారు. నిర్మాణాలు చేపడుతున్న కాలనీల వద్ద కనీస వసతులు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం పట్ల నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు జరుపుకున్నా కట్టిన ఇళ్లకు తాళాలు వేసిన వచ్చిన పరిస్థితి నెలకొంది. కనీస సౌకర్యాలు లేక పోవడంతో లబ్ధిదారులు పలుమార్లు అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆందోళన చెందుతున్నారు.



అక్‌సాహెబ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్



కోటవురట్లలో లే అవుట్



ఎంపిపిని సన్మానిస్తున బూడి

ఎంపిపిగా వెంకట రాజారామ్

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల ఎంపిపిగా తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ నియమితులయ్యారు. ఆదివారం మాడుగుల మండల పరిషత్ అధ్యక్షునిగా జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని రాజా రామ్‌కు అభినం దనలు తెలిపారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సహకారంతో బాధ్యతలు శ్రద్ధగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మాజీ ఎంపీపీ రామ ధర్మాజ, ఎంపీడీఓ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లింగన్ననాయుడు

తాగునీటి ట్యాంకుకు శంకుస్థాపన

-స్థలాన్ని విరాళంగా ఇచ్చిన స్థానిక సర్పంచ్

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో బికె పల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన పనులు ఆదివారం ప్రారంభించారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మాణం చేపడుతున్న పనులను స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు ప్రారంభించారు. కాగా ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని సర్పంచ్ లింగం నాయుడు విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-రోలుగుంట:జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్ చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆదివారం మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 40 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం లక్ష్యం కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బలిజ మహారాజు, నాయకులు పరవాడ నరసింహమూర్తి, కోన రామకృష్ణ పరవాడ దొరబాబు, బొబ్బిలి వెంకటేష్, సర్పంచ్ శ్రీను వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌డబ్ల్యుఓ రవి నిరుపేద గిరి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఆయన విద్యార్థులకు ఉచితం గా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తుంటారు. వివిధ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షల్లో పాల్గొనే వారికి సలహాలు ఇస్తూ వారికి ఆర్థికంగా కూడా ప్రోత్సాహాన్ని అంది స్తున్నారు. కళాశాల విద్యార్థులకు హెచ్‌డబ్ల్యుఓ అంది స్తున్న సేవలను పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు.



స్టడీ మెటీరియల్ ఇస్తున్న హెచ్‌డబ్ల్యుఓ



శక్తి వేషాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న శక్తి వేషాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి లో రజకుల బల్లల పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంక్రాంతి అనంతరం రాజకులు వృత్తిరీత్యా బల్లల పండగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా ఆదివారం రజకులు భక్తిశ్రద్ధలతో బల్లల పండగ నిర్వహించారు. రజకులు డప్పుల వాయిద్యాలతో నక్కపల్లి పురవీధుల్లో తిరుగుతూ నూకాలమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.శక్తి వేషాలను పలువురు ఆసక్తిగా తిలకించారు.

శంఖారావానికి చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో సోమవారం నిర్వహించే టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ శంఖారావం సమావేశానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. స్టేజీ నిర్మాణం, హోర్డింగ్‌ల ఏర్పాట్లను పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి టిడిపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి, శంఖారావ సభను జయప్రదం చేయాలని కోరారు.

కోటవురట్ల:మండలంలో కోటవురట్లలో మర్రిచెట్టు ప్రాంతం వద్ద ఈనెల 20న చేపట్టే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి



కోటవురట్లలో స్థలాన్ని పరిశీలిస్తున్న అనిత, నాయకులు



బుచ్చయ్యపేటలో స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శంఖారావం సభ సందరభంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే, టిడిపి మహిళా అధ్యక్షురాలు అనిత ఏర్పాట్లు పరిశీలించారు. శ్రేణులంతా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపికి అనుకూల పవనాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజలంతా వైసిపికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సుంకర బాబ్జి, పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఆదివారం మన బూత్ - మన భవిష్యత్తు కార్యక్రమం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా, టీడీపీ గెలుపే ధ్యేయం ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు


అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణా విభాగం ఆధ్వర్యాన ఎయిడ్స్‌పై మున్సిపాలిటీ పెద్ద బొడ్డేపల్లిళక్ష భద్రం ఫౌండేషన్ కళాజాత బృంద నాటకాన్ని ప్రదర్శించారు. హైచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రక్తదానం పై అవగాహన కల్పించారు. సుఖ వ్యాధులు చికిత్స, ఐసీటీసీ కౌన్సిలింగ్ కేంద్రాలపై తెలిపారు. హెచ్.ఐ.వి ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా చాడాలన్నారు. అనంతరం పోస్టర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమములో వార్డు కౌన్సిలర్ గుడివాడ రాజు నాయుడు, ఎయిడ్స్ కౌంట్రోల్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ శెట్టి గోవింద్, సిబ్బంది నాయుడు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


సత్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని పలువురు వాలంటీర్లను డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, తమ పరిధిలో కేటాయించిన కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నందుకు వాలంటీర్లను అభినందించారు. ఒకటో తేదీన తెల్లవారగానే పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డు, ఇళ్ల పట్టాలతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ వాలంటీర్లు అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో మరింత మంచి చేస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మీనా కుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాగా చదివి పరీక్షలకు సిద్ధం కండి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలలో ఎస్.ఎఫ్.ఐ, ఆదివాసీ గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక, జెవివి ఆద్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జెడ్పీటీసీ దీసరి గంగరాజు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.5000 రెండవ రూ. 3000, మూడవ బహుమతి రూ.2000 అందించడం జరుగుతుందని చెప్పారు.

సామాజిక భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏ ఎల్ పురం మేజర్ పంచాయతీలో గ్రామ సర్పంచ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల.సుజాత అభ్యర్థన మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, అనకాపల్లి ఎంపి భీశెట్టి వెంకట సత్యవతి గ్రామానికి రెండవ ఎస్సీ సామాజికి భవనానికి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉందని మరోసారి రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు బుల్లిప్రసాద్, కృష్ణ, పెదబాబు, కొండలబాబు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మాడుగుల: రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సమక్షంలో టిడిపి, జనసేన కుటుంబాలు వైసీపీలో ఆదివారం చేరారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన టిడిపి, జనసేన కు చెందిన కర్రీ తమ్మినాయుడు, బలబోయిన అప్పారావు, కర్రీ లక్ష్మిలు, ఇల్లపు గంగరాజు కుటుంబాలు వైసిపిలో చేరారు. వీరు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామధర్మజా, స్థానిక ప్రజాప్రతినిధులు కర్రీ గణేష్, నాగేశ్వర రావు, నాగరత్నం, చల్లం నాయుడు, ఫణింద్ర తదితరులు పాల్గొన్నారు.

25న డాక్టర్ జయగోపాల్ సంస్మరణ సభ

ప్రజాశక్తి-కలెక్టరేట్: భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, సాంస్కృతిక ఉద్యమకారుడు, ఆంధ్రా పెరియార్ డాక్టర్ జయ గోపాల్ సంస్మరణ సభను ఈనెల 25న ఉదయం 10 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించినట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యుడు జె.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 1972 ఫిబ్రవరి 13న భారత నాస్తిక సమాజాన్ని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జై గోపాల్ స్థాపించడమే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలలో హేతువాద నాస్తిక ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. గత 52 ఏళ్లగా దేశంలోని వివిధ ప్రాంతాలలో కుల మత మూడవిశ్వాసాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను చేపట్టడమే కాకుండా వాటి నిర్మూలనకు, దళితులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా చైతన్య పరచడమే కాకుండా సాంస్కృతిక ఉద్యమాల ద్వారా మాత్రమే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని డాక్టర్ జయ గోపాల్ భావించారని తెలిపారు.

20న రాజ్ గోపాల్‌కు పురస్కారం

ప్రజాశక్తి- కలెక్టరేట్: అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ సినీ గాయకులు, సంగీత దర్శకులు పాలగుమ్మి రాజ గోపాల్ కు ఘంటసాల సేవా పురస్కారం ప్రధానం చేయనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపాక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 న సాయంత్రం 6 గంటలకు అల్లూరి విజ్ఞాన కేంద్రం ఏర్పాటయ్యే ఘంటసాల సినీ సంగీత విభావరిలో ఖ్యాతి గాంచిన గాయనీ గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం సాలూరి రాజేశ్వరరావు వద్ద సహ సంగీత దర్శకుడిగా పని చేసిన పాలగుమ్మి రాజ గోపాల్ ను ఆత్మీయ సత్కారం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుత రావు,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ కె. సుహాసిని ఆనంద్ పాల్గొంటారన్నారు. సంగీత ప్రియులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వెంకన్నను దర్శించుకున్న ఎస్‌పి మురళీకృష్ణ

జ్ఞాపికను అందజేసిన అర్చకులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్నను ఆదివారం జిల్లా ఎస్పీ మురళీకృష్ణ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమా చార్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను, వెంకన్న చిత్రపటాన్ని ఎస్పి కుటుంబ సభ్యులకు అందజేశారు.


ఎస్‌పికి జ్ఞాపికను ఇస్తున్న అర్చకులు

అనారోగ్యంతో బాలిక మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని టోకురు పంచాయతీ పరిధి చిసగుడ గ్రామానికి చెందిన బాలిక సార మోకాస (మూడు సంవత్సరాలు) మృతి చెందింది. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్య సేవలు అందించినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడలేదని, ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బాలిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు నీరుగా బోరున విలపించారు.

శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపంతో పేదలకు మేలు

నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మున్సిపాలిటీ 28వ వార్డు అయ్యన్నకాలనీలోని నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపాన్నిఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే గణేష్, లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తామరణ అప్పలనాయుడు, వెలగా నారాయణరావు హాజరయ్యారు. కళ్యాణమండపం ను ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించగా, శ్రీకృష్ణదేవరాయల విగ్రహంను డాక్టర్ అధికారి గోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, అందరి సహాయ సహకారాలతో అందరికీ ఉపయోగపడే కళ్యాణ మండపం నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కళ్యాణమండపం నిర్మించినందుకు కమిటీ సభ్యులను అభినందించారు. ఎటువంటి అద్దె లేకుండా కేవలం కరెంట్ బిల్లు, నామమాత్రంగా మెయింటెనెన్స్ చార్జీలు మాత్రమే తీసుకొని కళ్యాణ మండపం అందరికి అందుబాటులో తీసుకురావడంతో పేదవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.కళ్యాణ మండపం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గొల్లవిల్లి రామారావు, ఉపాధ్యక్షులు కరణం ఈశ్వరరావు, సెక్రటరీ యర్ర గంగయ్య దొరబాబు, జాయింట్ సెక్రటరీ గాలి రమణ, ఆర్గనైజర్ సుర్ల నాని, మెంబర్లు కొడవటి గోపి, నీలం సతీష్ కుమార్, రౌతు చిన్నయ్యలను అభినందించారు.ఈ కార్యక్రమంలో తామరణ శ్రీను, గుడబండి నాగేశ్వరరావు, గొలుసు నరసింహమూర్తి, రాజేష్, దనిమిరెడ్డి ప్రసాద్, లగుడు స్వామి, చిటికెల కన్న, ఏకా శివ, కొణతాల వరలక్ష్మి, లలిత పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్